# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 331 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 12 ఆగస్టు 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 331 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 12 AUGUST 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




# కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు..

### డ్యామ్ గేట్లు మూసివేస్తుండగా తెగిన చైన్

### కర్నూలు జిల్లా ప్రజలకు అధికారుల హెచ్చరిక

### మంత్రి పయ్యావులకు సీఎం చంద్రబాబు ఫోన్



పెన్ పవర్ డెస్క్:కర్ణాటకలోని హొస్పేట సమీపంలో ఉన్న తుంగభద్ర డ్యామ్ గేటు ఒకటి కొట్టుకుపోయింది. శనివారం రాత్రి డ్యామ్ గేట్లు మూసివేస్తుండగా చైన్ తెగి 19వ నంబర్ గేటు ఊడిపోయింది. దీంతో నీరు భారీగా కిందకి వస్తోంది. ఇటీవలి వరదలకు డ్యామ్ కు వరద పోటెత్తింది. దీంతో అధికారులు మొత్తం 33 గేట్లు ఎత్తి నీటిని వదిలారు. శనివారం వరద తగ్గడంతో గేట్లు మూసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే 19వ నంబర్ గేటు ఊడిపోయిందని అధికారులు వెల్లడించారు. దీంతో 35 వేల క్యూసెక్కుల నీరు కిందికి వెళుతోందని చెప్పారు. డ్యామ్ గేటు ఊడిపోవడంతో ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కౌతాలం, కోస్గి, మంత్రాలయం, నందవరం మండలాల ప్రజలపై ప్రభావం ఉండవచ్చని పేర్కొంది. సహాయం కోసం 1070 112, 1800 425 0101 నంబర్‌కు కాల్ చేయాలని కోరింది. అయితే, గేటును పునరుద్ధరించేందుకు కర్ణాటక అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. డ్యామ్ లో నుంచి 60 టీఎంసీల నీటిని బయటకు పంపాక గేటును అమర్చుతామని ప్రకటించారు. కాగా, డ్యామ్ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసి కర్ణాటక మంత్రి శివరాజ్ ఆదివారం ఉదయం తుంగభద్ర డ్యామ్ వద్దకు వెళ్లి పరిశీలించారు.

వివరాలు 2లో..

## కొట్టుకుపోయిన ‘తుంగభద్ర’ గేటు...

### ఏపీ సీఎం చంద్రబాబు ఆరా



- నిర్వహణలో లేని పాతగేటు కొట్టుకుపోయినట్లు చెప్పిన అధికారులు
- తుంగభద్ర డ్యామ్ అధికారులతో మాట్లాడాలని పయ్యావుల కేశవ్‌కు సూచన
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

పెన్ పవర్ డెస్క్:తుంగభద్ర డ్యామ్ గేటు ఆదివారం కొట్టుకుపోవడంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పరిస్థితిని సమీక్షించారు. అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో ముఖ్యమంత్రి మాట్లాడారు.

వివరాలు 2లో..

## మానవ తప్పిదంతోనే తుంగభద్ర డ్యామ్ గేటు ధ్వంసం

- ప్రత్యామ్నాయ గేటు ఏర్పాటు చేసుకోవాలని హెచ్చరించినప్పటికీ పట్టించుకోలేదన్న ఎమ్మెల్యే
- గేట్ల నిర్వహణ సరిగ్గా లేదని విమర్శ
- రెండు ఏజెన్సీలతో గేటు పునరుద్ధరణ పనులు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడి



పెన్ పవర్ డెస్క్:మానవ తప్పిదంతోనే తుంగభద్ర డ్యామ్ గేటు ధ్వంసమైందని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన ఏబీఎన్ ఛానల్‌తో మాట్లాడుతూ... ప్రమాదం పొంచి ఉంది కాబట్టి ప్రత్యామ్నాయ

వివరాలు 2లో..

## అధిక దిగుబడులిచ్చే109 రకాల విత్తనాలు విడుదల చేసిన పీఎం మోదీ



పెన్ పవర్ డెస్క్: రైతులకు గుడ్ న్యూస్.. వ్యవసాయ ఉత్పాదకత పెంపొందించేందుకు కొత్త రకం విత్తనాలను ప్రధాని మోదీ ఆదివారం ఆగస్టు 11, 2024 విడుదల చేశారు. న్యూఢిల్లీలో ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ లో మొత్తం 109 రకాల కొత్తరకం విత్తనాలను శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి మోదీ విడుదల చేశారు. అధిక దిగుబడి, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకునే వంగడాలు, బయోఫోర్టిఫైడ్ రకాల విత్తనాలను తయారీ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం

వివరాలు 2లో..

## కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు...

### రబీకి నీళ్లు కష్టమేనన్న కర్ణాటక డిప్యూటీ సీఎం

- ఆదివారం కొట్టుకుపోయిన గేటును పరిశీలించిన డీకే శివకుమార్
- డ్యామ్ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఖరీఫ్‌కు మాత్రమే నీరు అందిస్తామన్న శివకుమార్
- రబీకి నీరు అందించడం కష్టం కాబట్టి రైతులు సహకరించాలని విజ్ఞప్తి



వివరాలు 2లో..

## టెక్కలిలో దువ్వాడ ఇంట్లోనే ఉంటా

- దువ్వాడ తనకు అగ్రిమెంట్ రాసిచ్చాడంటూ వ్యాఖ్యలు
- ఆయన అక్కడే ఉన్నా లేకున్నా తాను పిల్లలతో నివాసం ఉంటానని వెల్లడి
- అడ్డుకోవాలని చూస్తే ఆత్మహత్య చేసుకుంటానని మాధురి బెదిరింపు

వివరాలు 2లో..



## అక్కడ జగన్ పేరును తొలగించింది వైసీపీలోని ఆయన అభిమానులు

- అంబేద్కర్ విగ్రహం వద్ద కేవలం ఆయన పేరే ఉండాలన్న రవీంద్ర
- జగన్ తన పేరును పెద్ద పెద్ద అక్షరాలతో రాయించుకున్నారని విమర్శ
- అంబేద్కర్ వద్ద జగన్ పేరును వైసీపీ నేతలే జీర్ణించుకోలేకపోయారన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:అంబేద్కర్ స్మృతి వనంలో మాజీ సీఎం జగన్ పేరును వైసీపీలోని ఆయన అభిమానులే తొలగించారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్మృతి వనంలో మాజీ సీఎం పేరు తొలగింపుపై వైసీపీ నేతల విమర్శల నేపథ్యంలో ఆయన స్పందించారు. రాజ్యాంగ నిర్మాత

వివరాలు 2లో..



## బీజేపీ, జేడీఎస్ నేతలు వచ్చే 6 నెలల్లో జైలుకే

### కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే

- బీజేపీ పాలనలో అక్రమాలపై విచారణ జరుపుతున్నామని వెల్లడి
- సగం మంది జైలులో.. సగం మంది బెయిలుపై ఉంటారని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:బీజేపీ పాలనలో కర్ణాటకలో జరిగిన అక్రమాలపై విచారణ జరుపుతున్నామని ఆ రాష్ట్ర

వివరాలు 2లో..

## కుట్రపూరితం.. హిండెన్ బర్గ్ తాజా రిపోర్టుపై అదానీ గ్రూప్

### ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించి లాభాలు ఆర్జించే కుట్ర

### గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన కంపెనీ

### సెబీ చైర్ పర్సన్ పై నిరాధార ఆరోపణలు చేస్తోందని ఫైర్

పెన్ పవర్ డెస్క్:అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్ బర్గ్ తాజా నివేదికపై అదానీ గ్రూప్ స్పందించింది. సెబీ చైర్ పర్సన్ పై చేసిన ఆరోపణలు నిరాధారమని తేల్చిచెప్పింది. తమ సంస్థతో సెబీ చైర్ పర్సన్ మాధవి పూరీ బచ్ కు ఆర్థిక సంబంధాలు ఉన్నట్లు నిరాధార ఆరోపణలు చేసిందంటూ హిండెన్ బర్గ్ సంస్థపై మండిపడింది. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. హిండెన్ బర్గ్ నివేదిక మొత్తం కుట్రపూరితమని ఆరోపించింది. ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించడం ద్వారా హిండెన్ బర్గ్ లాభాలను ఆర్జించాలని కుట్ర చేసిందని, అందులో భాగంగానే

వివరాలు 2లో..



## అమెరికా వెళ్లాలనుకునే వారికి ఈ కోచింగ్ సెంటర్ మంచి శిక్షణ ఇస్తుంది

- గుంటూరులో ఫాంగ్ టెక్ ల్యాబ్ ఐటీ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి
- సరైన గైడెన్స్ లేక అమెరికాలో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారని వ్యాఖ్య
- అలాంటి వారికి ఈ సెంటర్ ఉపయోగకరమన్న కేంద్రమంత్రి



పెన్ పవర్ డెస్క్:అమెరికా వెళ్లాలనుకునే యువతకు ఐటీ రంగంలో మరింత నైపుణ్యంతో కూడిన కోచింగ్‌ను అందించేందుకు ఫాంగ్ టెక్ ల్యాబ్ ఐటీ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఈరోజు ఆయన గుంటూరులో ఈ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... అమెరికా వెళ్లాలనుకునే యువత కోసం ఇలాంటి కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

వివరాలు 2లో..

## అధికారం పోవడంతో జగన్ కు మతిభ్రమించింది



- మాజీ ముఖ్యమంత్రిపై టీడీపీ నేత తీవ్ర విమర్శలు
- జగన్ హయాంలో అంబేద్కర్ రాజ్యాంగానికి అవమానం
- అంబేద్కర్ విగ్రహాలకూ అప్పట్లో వైసీపీ రంగులు వేశారని ఫైర్

పెన్ పవర్ డెస్క్:అధికారంలో ఉన్నపుడు ప్రజల సొమ్ముతో విర్రవీగిన జగన్ కు అధికారం దూరమైన రెండు నెలల్లోనే మతిభ్రమించినట్లు ఉందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బుద్ధా వెంకన్న మండిపడ్డారు. ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడంలేదని

వివరాలు 2లో..

# కొట్టుకుపోయిన 'తుంగభద్ర' గేటు... ఏపీ సీఎం చంద్రబాబు ఆరా

- మొదటి పేజీ తరువాయి
నిర్వహణలో లేని పాతగేటు కొట్టుకుపోయినట్లు అధికారులు చంద్రబాబు దృష్టికి తీసుకు వచ్చారు. తక్షణం ప్రాజెక్టు వద్దకు డిజైన్ టీంను పంపించాలని ముఖ్యమంత్రి సూచించారు. జలాశయంలో 6 మీటర్ల ఎత్తు వరకు నీరు ఉందని అధికారులు సీఎంకు వివరించారు. స్టాప్ లాక్ అరేంజ్‌మెంట్ ద్వారా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై తుంగభద్ర డ్యాం అధికారులతో మాట్లాడాలని మంత్రి పయ్యావుల కేశవ్‌కు చంద్రబాబు సూచించారు. తాత్కాలిక గేట్ ఏర్పాటుపై మాట్లాడాలన్నారు. ప్రభుత్వం నుంచి తగిన సహకారం ఉంటుందని వారికి చెప్పాలన్నారు. అయితే ఇది పాత గేటు కావడంతో స్టాప్ లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని సీఎంకు పయ్యావుల చెప్పారు.డ్యామ్ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కౌతాలం, కోస్గి, మంత్రాలయం, నందవరం ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఘటనాస్థలికి ఇంజినీర్ల బృందం, సెంట్రల్ డిజైన్ కమిషనర్ వెళ్లినట్లు చెప్పారు.

# సంపాదకీయం

## అరటిపండు తింటే కలిగే.. 5 అమేజింగ్ హెల్త్ బెనిఫిట్స్

ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలంటుంటారు..ఆరోగ్యం లేకుంటే ఏదీ ముందుకు సాగదు..అలాంటి ఆరోగ్యం కోసం మనం పొద్దున లేచినప్పటినుంచి పడుకొనే వరకు అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంటాం.. అయితే అందరికి ఏ వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి తోడ్పడుతుంది.. ఏ ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటాం.. అనే విషయాలపై అవగాహన లేకపోవచ్చు. అలాంటి వారికోసం మనం తీసుకునే ఆహారం.. ప్రయోజనాలపై కొంత అవగాహన కోసం..

అరటిపండు అంటే ఎవరికి ఇష్టం ఉండదు.. పిల్లలు పెద్దలు చాలా ఇష్టంగా తింటుంటారు.. మరీ ఆరటిపండులో ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.. అరటిపండు తింటే లభించే పోషకాలు ఏమిటో తెలుసుకుందాం..

రోజూవారి ఆహారంలో అరటిపండు చేర్చడం ద్వారా ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. మనం జీవించేందుకు కావాల్సిన విటమిన్లు, మినరల్స్, జీర్ణం అయ్యే ఫైబర్ వంటి పోషకాలను అందిస్తుంది.

అరటిపండులో B6 విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలోకి ఈజీగా శోషణం చెందుతుంది. ఒక అరటిపండు మనకు రోజువారీ అవసరాలకు కావాల్సిన 25 శాతం B6ను అందిస్తుంది.

**B6 విటమిన్**

అరటిపండు నుంచి డైరెక్టుగా C విటమిన్ అందకపోయినప్పటికీ..ఇది మన రోజూవారీ అవసరాలకు కావాల్సిన 10 శాతం C విటమిన్ ఉత్పత్తి చేయడం సాయ పడు తుంది.

**మాంగనీస్..**

ఒక్క అరటిపండు మనకు రోజు కావాల్సిన మాంగటనీస్ ఖనిజాలను దాదాపు 13 శాతం అందిస్తుంది. ఇది కోల్లాజెన్ ఉత్పత్తి, ఫ్రీ రాడికల్స్ నుంచి కణాలను రక్షించ డంలో సాయపడుతుంది.

**పొటాషియం**

పొటాషియం.. మీడియం సైజ్ అరటిపండు 320 నుంచి 400 మిల్లీ గ్రాముల పొటాసియం ఖనిజాన్ని కలిగి ఉంటుంది. ఇది మన రోజువారీ అవసరాలకు కావాల్సిన 10 శాతం పొటాషియంను అందిస్తుంది.

**శక్తి ఉత్పాదకం**

ఒక్క అరటిపండు తింటే చాలు.. కొవ్వు లేకుండా సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి మూడు రకాల చక్కెరలను అందిస్తూ.. మనకు సహజ శక్తిని అందిస్తుంది.

అయితే షుగర్ వ్యాధి ఉన్న పేషెంట్స్ .. అరటిపండు తినకూడదని డాక్టర్లు చెబుతుంటారు.. జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.

## కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు..

- మొదటి పేజీ తరువాయి
**మంత్రులు, అధికారులకు చంద్రబాబు ఫోన్**

తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆరా తీశారు. డ్యామ్ వద్దకెళ్లి పరిస్థితిని గమనించాలని, అక్కడి పరిస్థితిని తనకు వివరించాలని కర్నూలు సీఈ, విజయవాడ సెంట్రల్ డిజైన్స్ కమిషనర్, జాతీయ డ్యామ్ గేట్ల నిపుణులు కన్నం నాయుడిని ఆదేశించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం ఆదేశించారు. తాత్కాలిక గేటు ఏర్పాటుపై డ్యామ్ అధికారులతో మాట్లాడాలని, అందుకు అవసరమైన సహకారం అందించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను చంద్రబాబు ఆదేశించారు. అయితే, పాత డిజైన్ కావడం వల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు.

## మానవ తప్పిదంతోనే తుంగభద్ర డ్యామ్ గేటు ధ్వంసం

- మొదటి పేజీ తరువాయి
గేటు ఏర్పాటు చేసుకోవాలని సాగునీటి రంగ నిపుణులు హెచ్చరించినప్పటికీ తుంగభద్ర బోర్డు అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. గేట్ల నిర్వహణ సరిగ్గా లేదన్నారు. రెండు ఏజెన్సీలతో గేటు పునరుద్ధరణ పనులు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. తుంగభద్ర నుంచి 60 టీఎంసీల నీరు దిగువకు వదిలితే రాయలసీమకు తీరని నష్టం జరుగుతుందన్నారు.

## కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు... రబీకి నీళ్లు కష్టమేనన్న కర్ణాటక డిప్యూటీ సీఎం

**పెన్ పవర్ డెస్క్:**తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో... ఈ ఏడాది ఖరీఫ్ పంటకు నీరు అందేలా చూస్తామని, రబీ పంటకు మాత్రం నీరు అందించడం కష్టమేనని... కాబట్టి రైతులు సహకరించాలని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడంతో ఆయన ఆదివారం డ్యాంను పరిశీలించారు. గేటు ధ్వంసం కావడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్యాంకు గేటును బిగించే అంశంపై మాట్లాడారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... తుంగభద్ర డ్యామ్ 19వ గేటు ధ్వంసం కావడం బాధకరమన్నారు. ఈ డ్యామ్ కర్నాటక- ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మూడు రాష్ట్రాలకు వరప్రదాయిని అన్నారు. ఈ డ్యామ్‌లో 40 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. మిగతా నీటిని దిగువకు విడుదల చేస్తే గేటు మరమ్మతులకు అవకాశం ఉంటుందన్నారు. వీలైనంత త్వరగా గేటును పునరుద్ధరిస్తామన్నారు. కాగా, గేటు మరమ్మతుల కోసం నీటిని కిందకు వదులుతున్నారు. మరో ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు.

## టెక్కలిలో దువ్వాడ ఇంట్లోనే ఉంటా

- మొదటి పేజీ తరువాయి
ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వివాదం రచ్చకెక్కింది. టెక్కలిలోని ఆయన నివాసంపై తనకు హక్కు ఉందంటే తనకే హక్కు ఉందని దువ్వాడ వాణి, దివ్వెల మాధురి చెబుతున్నారు. తనపై ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తూ, తనను బజారుకు లాగారని వాణిపై మండిపడ్డారు. దువ్వాడ శ్రీనివాస్ తనకు బాకీ ఉన్నారని, అగ్రిమెంట్ పేపర్ రాసిచ్చారని చెప్పారు. టెక్కలిలోని దువ్వాడ శ్రీనివాస్ ఇంటిపై తనకు హక్కు ఉందని, డాక్యుమెంటరీ ప్రూఫ్ కూడా ఉందన్నారు. శ్రీనివాస్ ఆ ఇంట్లో ఉన్నా సరే, ఇల్లు విడిచిపెట్టి వేరే ఎక్కడైనా ఉన్నా సరే.. తాను మాత్రం అదే ఇంట్లో పై పోర్షన్ లో పిల్లలతో కలిసి ఉంటానని స్పష్టం చేశారు. తనను అడ్డుకోవాలని చూస్తే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. తన పిల్లల జోలికి వస్తే చెప్పుతో కొడతానంటూ దువ్వాడ వాణిపై మాధురి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు తాను టెక్కలికి వెళుతున్నట్లు మాధురి చెప్పారు. కాగా, ఈ విషయంపై దువ్వాడ శ్రీనివాస్ కూతురు హైంధవి మాట్లాడుతూ.. టెక్కలిలోని ఇల్లు తమ తల్లి డబ్బులతో నిర్మించిందని, ఈ ఇంటిపై తమకు హక్కు ఉందని చెప్పారు. తాము ఇంటి ముందు నుంచి వెళ్లేది లేదని తేల్చిచెప్పారు. ఈ ఇంట్లో దువ్వాడ శ్రీనివాస్ కు ఉండే హక్కు ఉంది అయితే తాము ఇంట్లో ఉండకూడదనే హక్కు మాత్రం ఆయనకు లేదన్నారు.

## అధిక దిగుబడులిచ్చే109 రకాల విత్తనాలు విడుదల చేసిన పీఎం మోదీ

- మొదటి పేజీ తరువాయి
చేస్తున్న ప్రయత్నాలలో ఇదొక ముందడుగు అని ప్రధాని మోదీ అన్నారు. %×ూా=×%లో జరిగిన విత్తనాల విడుదల కార్యక్రమంలో శాస్త్రవేత్తు, రైతులతో సంభాషించారు ప్రధాని మోదీ. కొత్త రకం విత్తనాల ప్రాముఖ్యతను తెలిపారు. ఈ ఆవిష్క రణలు వ్యవసాయంలో కీలక ప్రభావం చూపుతాయన్నారు. పోషకాహార ఎంపికల వైపు దేశ ప్రజలు మళ్లుతున్నారు.. మిల్లెట్లకు పెరుగుతున్న ప్రాధాన్యతతను మోదీ గుర్తు చేశారు. సహజ వ్యవసాయం ప్రయోజనాలు, సేంద్రీయ వ్యవసాయ పద్దతులపై సాధారణ ప్రజల్లో ఆరోగ్య పరమైన విశ్వాసం పెరుగుతుందన్నారు.

ప్రధాని విడుదల చేసిన 109 రకాల విత్తనాల్లో 34 క్షేత్ర విత్తనాలు, 27 ఉద్యానవన పంటలకు సంబంధించిన విత్తనాలు ఉన్నారు. క్షేత్ర పంటల విత్తనాలలో మిను ములు, మేత పంటలు, నూనెగింజలు, పప్పు ధాన్యాలు, చెరకు, పత్తి, ఇతర తృణధాన్యాలు ఉన్నాయి. ఉద్యానవన పంట్లో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, తోటల పంటలు, దుంప పంటలు, సుగంధద్రవ్యాలు, పువ్వులు, ఔషద మొక్కలు ఉన్నాయి.

ఈ ఆవిష్కరణ ప్రయోజనాలు వీలైనంత ఎక్కువ మంది రైతులకు చేరేలా , ఈ కొత్త రకం విత్తనాల ప్రయోజనాలను నెలవారీగా రైతులకు తెలియజేయాలని కృషి విజ్ఞాన కేంద్రాలను ప్రధాని మోదీ కోరారు. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో ప్రభుత్వం చేస్తున్న కృషికి కృషి విజ్ఞాన కేంద్రాలు ఇస్తున్న సహకారాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. కొత్త రకం విత్తనాలను అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తల పాత్రను కూడా ప్రధాని మోదీ ప్రశింసించారు. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను సహజ వ్యవసాయంలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ వ్యూహంలో భాగంగా సర్టిఫికేషన్, బ్రాండింగ్ సపోర్టును రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించనుంది. పప్పు ధాన్యాలు, నూనె గింజలలో స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వం వాటి ఉత్పత్తి, నిల్వలను , మార్కెటింగ్ ను బలోపేత చేయాలని యోచిస్తున్నట్టు ప్రధాని మోదీ చెప్పారు.

## కుట్రపూరితం.. హిండెన్ బర్గ్ తాజా రిపోర్టుపై అదానీ గ్రూప్

- మొదటి పేజీ తరువాయి
మాధవి బచ్ పై ఆరోపణలు చేసిందని విమర్శించింది. గతంలో తమ గ్రూప్ పై చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ.. హిండెన్ బర్గ్ ఆరోపణలు అసత్యమని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిన విషయాన్ని గుర్తుచేసింది.

**హిండెన్‌బర్గ్ ఆరోపణలు ఇవే..**

శనివారం సాయంత్రం విడుదల చేసిన నివేదికలో అదానీ గ్రూపునకు విదేశాల నుంచి నిధులను సమకూరుస్తున్న పలు డొల్ల కంపెనీల్లో సెబీ చైర్ పర్సన్ మాధవీ పూరీ బచ్, ఆమె భర్త ధావల్ బచ్‌లకు వాటాలు ఉన్నాయని వెల్లడించింది. బెర్ముడా, మారిషస్ దేశాలలో ఏర్పాటైన డొల్ల కంపెనీల నుంచి అదానీ గ్రూపుకు విదేశీ నిధులు సమకూరుతున్నాయని చెప్పింది. ఈ కంపెనీలలో మాధవి, ధావల్ బచ్ లకు వాటాలు ఉన్నాయని పేర్కొంది. ఈ డొల్ల కంపెనీలను గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ కంట్రోల్ చేస్తున్నారని ఆరోపించింది. ఈ వార్త స్టాక్ మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## బీజేపీ, జేడీఎస్ నేతలు వచ్చే 6 నెలల్లో జైలుకే

- మొదటి పేజీ తరువాయి
ఐటీబీటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే తాజాగా వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వాళ్లు జైలుకు వెళతారని జోస్యం చెప్పారు. బీజేపీ, జేడీఎస్ నేతలు సగం మంది జైలులో, మిగతా సగం మంది బెయిలుపై ఉంటారని అన్నారు. ఈమేరకు ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. వాటిపై తమ ప్రభుత్వం విచారణ జరిపిస్తోందని వివరించారు. ప్రస్తుతం పలు కేసుల్లో విచారణ అధికారులు మధ్యంతర నివేదికలు సమర్పించారని చెప్పారు.వాటి ఆధారంగా చర్యలు తీసుకోబోతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ ద్వారా అస్థిర

పరిచేందుకు కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆరోపించారు. ఎవరో ఫిర్యాదు చేస్తే తమ పార్టీ నేతలకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన గవర్నర్.. మాజీ మంత్రి మురుగేశ్ నిరాణిపై ఫిర్యాదు చేస్తే మాత్రం సైలెంట్ గా ఉన్నారని మండిపడ్డారు. గవర్నర్‌కు ఎక్కడి నుంచో సూచనలు అందుతున్నాయని, వాటి ప్రకారమే ఆయన నడుచుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల వల్లే గవర్నర్లను కోర్టులు మందలించే స్థితి ఏర్పడిందని మంత్రి చెప్పారు.

## అమెరికా వెళ్లాలనుకునే వారికి ఈ కోచింగ్ సెంటర్ మంచి శిక్షణ ఇస్తుంది

- మొదటి పేజీ తరువాయి
ఇక్కడి నుంచి వెళ్లే సమయంలో సరైన గైడెన్స్ లేక అమెరికా వెళ్లిన విద్యార్థులు పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి సంస్థలో శిక్షణ తీసుకొని వెళి తే అమెరికాలో ఇబ్బందులు తప్పుతాయన్నారు. ఆయన ఇంకా మాట్లాడుతూ... అమెరికా లో స్థిరపడిన ప్రవాసాంధ్రులుతిరిగివచ్చి రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.

## అక్కడ జగన్ పేరును తొలగించిందే వైసీపీలోని ఆయన అభిమానులు

- మొదటి పేజీ తరువాయి
అంబేద్కర్ విగ్రహం వద్ద కేవలం ఆయన పేరే ఉండాలన్నారు. కానీ జగన్ తన పేరును పెద్ద పెద్ద అక్షరాలతో రాయించుకున్నారని విమర్శించారు. దీనిని జీర్ణించుకోలేక ఆ పార్టీలోని వైసీపీ అభిమానులే తమ పార్టీ అధినేత పేరును తొలగించినట్లు చెప్పారు.మచిలీపట్నం గిలకలదిండిలోని షిప్పింగ్ హార్బర్ పనులను కేంద్ర పర్యావరణ, మత్య శాఖ అధికారుల బృందం పరిశీలించింది. సముద్ర తీర ప్రాంతంలో ఆక్వా, మత్య పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను కొల్లు రవీంద్ర... అధికారులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఏపీలో దాదాపు 970 కిలో మీటర్లు మేర సముద్ర తీర ప్రాంతం ఉందన్నారు. మెరైన్ ఫిషింగ్‌లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు.

## అధికారం పోవడంతో జగన్ కు మతిభ్రమించింది

- మొదటి పేజీ తరువాయి
విమర్శించారు. సీఎంగా ఉన్న సమయంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమానించి, రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారంటూ వెంకన్న తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల సొమ్ముతో విలాసాలు చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ జగన్ కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు.విజయవాడలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి రూ. 404 కోట్లు ఖర్చయినట్లు లెక్కలు చెప్పారని, అందులో రూ.226 కోట్లను జగన్ నొక్కేసారని ఆరోపించారు. చివరికి అంబేద్కర్ విగ్రహానికి కూడా వైసీపీ రంగులు వేసి ఆ మహానుభావుడిని అవమానించారని గుర్తుచేశారు. విగ్రహంపైన అంబేద్కర్ పేరు కంటే తన పేరునే పెద్దగా రాయించుకున్నారని ఫైర్ అయ్యారు. ఇది సహించలేక అంబేద్కర్ అభిమానులు జగన్ పేరును తొలగించి ఉండవచ్చని చెప్పారు. అంబేద్కర్‌ను జగన్ అడుగడుగునా అవమానించారని, దళితులపై దమనకాండకు పాల్పడిన వారిని కాపాడారని ఆరోపించారు.

**మీలో మీరు కొట్టుకుని మాపై నిందలా?**

రాష్ట్రంలో ఇటీవల జరిగిన గొడవలతో టీడీపీకి సంబంధం లేదని బుద్ధా వెంకన్న స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు వాళ్లలో వాళ్లు కొట్టుకుని చనిపోతే టీడీపీపై జగన్ నిందలు వేశారని ఆరోపించారు. జగన్ కు అసలు అంబేద్కర్ పేరును కూడా ఎత్తే అర్హత లేదన్నారు. దళితుల సంక్షేమం కోసం తెచ్చిన 27 సంక్షేమ పథకాలను నిలిపేసిన చరిత్ర జగన్ ది అని మండిపడ్డారు. దళితులపై అఘాయిత్యాలకు పాల్పడ్డ దోషులను ఎంతమందిని జగన్ తన పాలనలో పట్టుకున్నారో చెప్పాలని నిలదీశారు. డ్రైవర్ ను చంపి, మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లి ఇచ్చిన ఎమ్మెల్సీని కనీసం పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదని బుద్ధా వెంకన్న గుర్తుచేశారు. అమరావతిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని, ఎట్టి పరిస్థితుల్లోనూ విగ్రహం ఏర్పాటు చేసి తీరతామని చెప్పారు.

**అభివృద్ధి ఎలా ఉంటుందో జగన్ కు చూపిస్తాం..**

సీఎం చంద్రబాబు సారథ్యంలో ఏపీ అభివృద్ధి ఎలా ఉంటుందో జగన్ కు చూపిస్తామని బుద్ధా వెంకన్న చెప్పారు. సంపద సృష్టి లేకుండా అభివృద్ధి ఎలా జరుగుతుందో జగన్‌కు తెలియదన్నారు. రెచ్చగొట్టే ట్వీట్లు పెట్టి జగన్ రాక్షస ఆనందం పొందుతున్నారని, కులాల మధ్య చిచ్చు పెట్టి ఏపీకి పరిశ్రమలు రాకుండా అడ్డుకుంటున్నాడని జగన్ పై విరుచుకుపడ్డారు. అయితే, చంద్రబాబు పాలనా దక్షత ముందు జగన్ ఆటలు సాగవన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధికి జగన్ సహకరించాలని, కాదని కుట్రలు చేస్తే ప్రజలే ఆయనను తరిమి కొడతారని బుద్ధా వెంకన్న హితవు పలికారు.

# ఉత్తరాదిన జల ప్రళయం..రాజస్థాన్‌లో రెడ్ అలర్ట్..
# జమ్ము కాశ్మీర్ లో కుండపోత




ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ఏర్పడింది. దీని ప్రభావంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలతో ఏకంగా ఊర్లకు ఊర్లే చెరువులుగా మారుతున్నాయి. వాగులు, వంకలు పొంగుపొర్లుడంలో రోడ్లన్నీ జలయమయ్యాయి. ఈ క్రమంలోనే.. రాజస్థాన్‌లో వర్ష బీభత్సం కొనసాగుతుండటంతో రెడ్ అలర్ట్? ప్రకటించారు. పలు ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాల్లోకి భారీగా వరదనీరు ప్రవేశించింది. వందల ఎకరాల్లో పంటనష్టం జరిగింది.

భారీ వర్షాలతో అప్రమత్తమైన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గత మూడు రోజులుగా ( ఆగస్టు 11 నాటికి) గంగాపూర్‌లో కుండపోత వర్షం కురుస్తోంది. ఇక.. రాబోయే ఐదారు రోజుల వరకు జైపూర్, అజ్మీర్, కోట, ఉదయ్‌పూర్, భరత్‌పూర్ డివిజన్లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పశ్చిమ రాజస్థాన్‌లోని బికనీర్, జోధ్‌పూర్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.ఇదిలావుంటే.. ఉత్తర భారతాన్ని వర్షాలు వణికిస్తూనే ఉన్నాయి. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, త్రిపుర, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్‌లో భారీ వర్షాలు కురుస్తుండగా.. ఇప్పుడు మరోసారి వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ చేసింది. జమ్ము కాశ్మీర్? లో కుండపోతగా వర్షాలు పడుతున్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వార్నింగ్ ఇచ్చింది. ప్రధానంగా.. హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలతో రెండు రోజులపాటు ( ఆగస్టు 11 నుంచి) ఆరెంజ్, 15వరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆకస్మిక వరదలు కూడా సంభవించే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. మరోవైపు.. దేశ దాజధాని ఢిల్లీలో మరోసారి భారీ వర్షం కురిసింది. ఢిల్లీలో మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. మొత్తంగా.. దేశవ్యాప్తంగా ఉత్తరాదితోపాటు పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పంజాబ్?, హర్యానా, హిమాచల్? ప్రదేశ్ రాష్ట్రాల్లో ఈదురు గాలులతో కూడిన

భారీ వర్షాలు పడతాయరి వాతావరణ శాఖ ? హెచ్చరించింది. నర్మదా పరివాహక ప్రాంతంలో రెడ్ అలర్ట్? జారీ చేశారు . దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాఖండ్?, యూపీ రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన చేసింది. ఇక కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలను కేంద్రం అలర్ట్? చేసింది.

## కూలిన శిక్షణ విమానం.. ఇద్దరు హైదరాబాద్ పైలట్లకు గాయాలు



మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో ఆదివారం ఓ ప్రైవేట్ ఏవియేషన్ అకాడమీకి చెందిన శిక్షణ విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ పైలెట్లు హైదరాబాద్‌కు చెందిన కెప్టెన్ వి. చంద్ర ఠాకూర్, నగేష్ కుమార్‌గా గుర్తించారు. ఇంజన్ ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. రెండు సీట్లున్న సెస్నా 152 విమానం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో కూలిపోయిందని గునా కాంట్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ దిలీప్ రాజోరియా తెలిపారు. ఇంజన్ వైఫల్యం కారణంగా విమానం దాదాపు 40 నిమిషాల పాటు గాలిలో చక్కర్లు కొట్టినట్లు స్థానికులు తెలిపారని ఆయన వెల్లడించారు.

కర్ణాటకలోని బెలగావి ఏవియేషన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ఈ విమానాన్ని టెస్టింగ్, మెయింటెనెన్స్ పరీక్షల కోసం గునాలోని షా-షిబ్ అకాడమీకి తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలంలో అకాడమీ అధికారులతో పాటు కాంట్ పోలీస్ స్టేషన్ పోలీసులు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలను కనిపెట్టేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

కాగా, మార్చి 6న మధ్యప్రదేశ్‌లోని గుణ ఎయిర్‌స్ట్రిప్‌లో శిక్షణ విమానం కూలి ఒక మహిళా పైలట్ గాయపడ్డారు. ఎయిర్‌స్ట్రిప్‌లో అత్యవసర ల్యాండింగ్ చేస్తున్నప్పుడు సాంకేతిక లోపంతో విమానం రన్‌వే నుండి జారి సమీపంలోని పొదల్లోకి దూసుకెళ్లింది.

## 8 నెలల బాలుడు మృతి.. ఆసుపత్రి ముందు కుటుంబసభ్యుల ఆందోళన



రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలోని రవికృష్ణ చిల్డ్రన్ హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైద్యుల నిర్లక్ష్యంతో 8 నెలల బాలుడు మృతిచెందాడని కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు.

**ఏం జరిగిందంటే..?**

రాయపోలు గ్రామానికి చెందిన మహేష్, ప్రవలిక దంపతుల కుమారుడు ప్రజ్వల్(8నెలలు)కు జ్వరం రావడంతో శనివారం(ఆగస్టు 10) రవి కృష్ణ చిల్డ్రన్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు డెంగ్యూ ఫీవర్ వచ్చిందంటూ హాస్పిటల్‌లో అడ్మిట్ చేసుకున్నారు. రాత్రి ఏ మేరకు వైద్యం అందించారో తెలియదు కానీ, ఉదయం టెస్టులు చేసి ప్లేట్లెట్స్ భారీగా పడిపోయాయంటూ హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సూచించారు. హుటాహుటీన తల్లిదండ్రులు బాలుడిని హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు వదిలాడు.

శనివారం అడ్మిట్ చేసుకున్న డాక్టర్లు ఆదివారం ఉదయం వరకు టెస్టులు చేయకుండా నిర్లక్ష్యం చేయటం వల్లనే తమ బిడ్డ చనిపోయాడని బాలుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. రవి కృష్ణ చిల్డ్రన్ హాస్పిటల్ కు ప్రభుత్వ అనుమతులు లేవని వారు ఆరోపించారు. ఇలాంటి ఆసుపత్రులు ఇబ్రహీంపట్నం పరిధిలో పలు వెలుస్తున్నప్పటికీ వైద్య శాఖ పట్టించుకోవడం లేదని అన్నారు.

## లలితా సహస్రనామం ప్రకారం.. శ్రావణ శుక్రవారం అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలివే..

లలితా సహస్ర నామంలో ఎన్నో సాధనా రహస్యాలతో పాటూ అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన నైవేద్యాల గురించి కూడా వివరించారు. అయితే అమ్మవారి నైవేద్యాల విషయంలో ఎప్పుడు ఏం సమర్పించాలి అనే ఆలోచన వస్తుంది. లలిత సహస్రనామంలో అమ్మవారికి ఇష్టమైన పదార్థాలు ఏవి.. ఎలాంటివి నివేదన సమర్పిస్తే అమ్మవారు సంతోషిస్తారో తెలుసుకుందాం....

శ్రావణమాసం జరుగుతోంది..తెలుగు లోగిళ్లలో పండుగ కళ ఉట్టిపడుతోంది. సాధారణంగా శుక్రవారం అంటే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రావణశుక్రవారం అంటే అంతకుమించిన భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవిని ఆరాధిస్తారు. శ్రావణమాసంలో శుక్రవారాలు మాత్రమే కాదు...ఏ శుక్రవారం అయినా, అమ్మవారి పూజ చేసే సందర్భం ఏదైనా కానీ కొన్ని పదార్థాలు నివేదిస్తే అమ్మకు సంతోషమని లలితాసహస్రంలోనే ఉంది.


**గుడాన్న ప్రీతి మానసా ( బెల్లంంఅన్నము):** గుడము అంటే బెల్లం.. నిత్యపూజలో భాగంగా కూడా బెల్లం నివేదిస్తే ఆ ఇంటి సభ్యులంతా ఆరోగ్యంగా ఉంటారని పండితులు చెబుతారు. అలాంటి బెల్లంతో చేసిన అన్నం అంటే అమ్మవారికి ప్రీతి. బెల్లానికి నిలువ, అంటు దోషం లేదు...అందుకే కుదిరితే బెల్లంతో చేసిన పరమాన్నం లేదంటే బెల్లంముక్క నివేదించినా చాలు.. అమ్మవారు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తారు

**స్నిగ్ధౌదన ప్రియా( కొబ్బరి అన్నం):** స్నిగ్ధ అంటే తెల్లని, ఓదనం అంటే అన్నం...తెల్లటి అన్నాన్ని ఇష్టపడే తల్లి అని అర్థం. అయితే ఇక్కడ తెల్లటి అంటే స్వచ్ఛమైన కొబ్బరి అన్నం అని అర్థం.

**పాయసాన్న ప్రియా:** ( పాలతో పాయసం)పాలు - బియ్యం కలిపి వండిన వంట అంటే అమ్మవారికి ప్రీతికరం.దీనినే క్షీరాన్నం అంటారు..

**మధుప్రీతా( తియ్యటి పదార్థాలు):** మధు అంటే తేనె ...ప్రీతి అంటే ఇష్టం...తేనె లాంటి తియ్యటి పదార్థాలు ఇష్టపడడం అని ఆంతర్యం. శుక్రవారం రోజు అమ్మవారికి గారెలు చేసి తేనెలో ముంచి





నివేదిస్తారు

**దధ్యన్నాసక్త హృదయా ( దద్దోజనం లేక పెరుగన్నం):** దధి అంటే పెరుగు...అన్నం అంటే బియ్యంతో వండినది...ఆసక్త అంటే ఇష్టాన్ని చూపేది...హృదయా అంటే మనసు కలిగినది. పెరుగుతో తయారు చేసిన పదార్థంపై ఆసక్తిచూపే హృదయం కల అమ్మ అని అర్థం.

**ముద్గౌదనాసక్త హృదయా( పెసలతో వండిన అన్నం):** ముద్గ అంటే పెసలు..ఓదనం అంటే అన్నం..ఆసక్త అంటే అభిరుచి...పెసలతో వండిన అన్నమంటే ఇష్టం. పెసరపప్పు నానబెట్టి కాస్త బెల్లం వేసి నివేదించవచ్చు...లేదంటే పెసరపప్పు పాయసాన్ని అమ్మకు నైవేద్యంగా సమర్పించవచ్చు.

**హరిద్రాన్నైక రసికా ( పులిహోర లేక పసుపు అన్నం) :** పసుపు - అన్నం...మీకు అర్థమయ్యేలా చెప్పాలంటే పులిహోర. హరిద్రం అంటే పసుపు....అమ్మవారికి పులిహోర నివేదించి దానిని ప్రసాదంగా స్వీకరించి అందరకీ పంచిపెడితే మీకు ఇంట్లో అన్నీ శుభాలే జరుగుతాయి.

**సర్వౌదనప్రీతచిత్తా (కదంబం) :** సర్వోదనప్రీత అంటే...అన్ని రకాల అన్నాన్ని ఇష్టపడేది అని అర్థం. భక్తి శ్రద్ధలతో వండిపెట్టిన అన్నం , కూరగాయలు ఏవైనా అమ్మవారికి ప్రీతికరమే. దానినే కదంబం అంటారు.

**కదంబం ఇలా తయారు చేయాలి**

అన్ని రకాల కూరగాయలు శుభ్రంగా కడిగి ముక్కలుగా కట్ చేయాలి. బియ్యం, కందిపప్పు కడిగిన తర్వాత..వాటితోపాటూ తరిగిన కూరగాయల ముక్కలు వేసి పసుపు, ఉప్పు జోడించి ఉడికించాలి. ఆ తర్వాత ఆవాలు, జీలకర్ర, శనగ పప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, ఇంగువ పోపు వేసి... పచ్చిమిర్చి , కరివేపాకు, టమోటా వేయాలి. ఆ తర్వాత చింతపండు గుజ్జు, బెల్లంపొడి వేసి ఉడికించాలి. సాంబారు పొడివేసి కొద్దిసేపు ఉడికించిన తర్వాత.. దానిలో బియ్యం, కందిపప్పు మిశ్రమాన్ని జోడించి కాసేపు స్టౌపై ఉంచి... కొత్తిమీర, కొబ్బరి తురుము వేసి కలిపి దించేయాలి. నేతిని జోడించి అమ్మవారికి నివేదించాలి.

మీ శక్తి కొలది అమ్మవారికి ఏం నివేదించినా...భక్తిశ్రద్ధలు ప్రధానం అని గుర్తుంచుకోవాలి. వండే ఆహారంలో భక్తికలగలిపినప్పుడే అది నైవేద్యంగా మారుతుంది అనే విషయాన్ని గ్రహించాలి. . .

## దువ్వాడ ఇష్యూలో ట్విస్ట్... రోడ్డు ప్రమాదంలో దివ్వెల మాధురికి గాయాలు, ఆసుపత్రిలో చికిత్స

**లక్ష్మీపురం టోల్ గేట్ సమీపంలో కారు ప్రమాదానికి గురై గాయపడిన మాధురి**

**ప్రమాదమా? ఆత్మహత్యాయత్నమా? అనే కోణంలో విచారిస్తున్న పోలీసులు**

**తాను డిప్రెషన్‌లో ఉన్నానన్న మాధురి**



వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబంలో చెలరేగిన వివాదానికి కేంద్రబిందువుగా మారిన దివ్వెల మాధురి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. శ్రీనివాస్ వ్యవహారంపై గత కొన్నిరోజులుగా ఆయన భార్య వాణి తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేట్ సమీపంలో మాధురి కారు ప్రమాదానికి గురై... ఆమె గాయపడ్డారు.


టోల్ గేట్ సమీపంలో ఆగి ఉన్న ఓ కారును మాధురి కారు ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలయ్యాయి. దీంతో ఆమెను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం సమయంలో ఆమె జూమ్ కాల్ మాట్లాడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారని తెలుస్తోంది. ఇది ప్రమాదమా? ఆత్మహత్యాయత్నమా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాధురి మీడియాతో మాట్లాడుతూ... మూడు రోజులుగా తనపై వస్తున్న ట్రోల్స్ తీవ్ర మనస్తాపానికి గురి చేశాయన్నారు. తాను డిప్రెషన్‌లో ఉన్నానని, ఆత్మహత్య చేసుకోవడానికే ఇంటి నుంచి బయటకు వచ్చానన్నారు. ఇది రోడ్డు ప్రమాదం కాదని, తానే కారును ఢీకొట్టానన్నారు. వాణి తనపై ఆరోపణలు చేస్తున్నందువల్లే భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్లు చెప్పారు. వైద్యులు తనకు చికిత్స అందించవద్దని కోరారు. తనపై, తన పిల్లలపై వస్తున్న ట్రోల్స్ తట్టుకోలేకపోతున్నానన్నారు. తాను తర్వాతనైనా సూసైడ్ చేసుకొని చనిపోతానన్నారు. కాగా, తన భర్త మాధురితో ఉంటూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడని వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను భార్య దువ్వాడ వాణి ఆరోపిస్తున్నారు.

## రాత్రికి, పగలుకు మధ్య.. నాసా షేర్ చేసిన 'టెర్మినేటర్?' చిత్రాలివి

**సూర్యకాంతి ప్రసరిస్తూ.. చీకట్లు వెనక్కిపోతున్న దృశ్యం**

**రోజూ రెండు సార్లు జరిగే ప్రక్రియ**

**అంతరిక్షానికి, భూమికి మధ్య కాంతులతో అద్భుత చిత్రాలు**



వెలుగు మొదలైతే పగలు.. వెలుగు వెళ్లిపోతే రాత్రి.. ఈ రెండింటికి మధ్య ఉండేది సంధ్యా సమయం. మనకు ఇదే స్పష్టంగా కనిపించదు. కానీ ఆకాశం నుంచి చూస్తే.. వెలుగు, చీకట్ల మధ్య ఒక విభజన రేఖ కనిపిస్తుంది. భూమి తిరుగుతున్న కొద్దీ అది నిరంతరం కదులుతూనే ఉంటుంది. ఇలా రాత్రిని, పగలును విభజించే రేఖను సాంకేతికంగా 'టెర్మినేటర్' అని పిలుస్తారు.


**అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి చిత్రించి..**

భూమ్మీద దాదాపు అన్ని ప్రాంతాల్లో రోజూ రెండు సార్లు ఈ ప్రక్రియ జరుగుతుంది. టెర్మినేటర్ రేఖ వాటిపై నుంచి కదులుతూ వెళుతుంది. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తున తిరుగుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ టెర్మినేటర్ రేఖను నాసా చిత్రించింది. తాజాగా తమ ఇన్ స్టాగ్రామ్ అకౌంట్లో ఆ ఫొటోలను పోస్ట్ చేసింది.

**అంతరిక్షానికి భూమికి మధ్య కాంతులతో..**

ఈ చిత్రాల్లో.. అన్నింటికన్నా పైన నల్లని అంతరిక్షం.. దాని దిగువన నీలి రంగులో భూమి వాతావరణం.. దాని కింద భూమిపై పడి తెలుపు రంగులో ప్రతిఫలిస్తున్న కాంతి.. ఆ దిగువన బంగారు రంగులోని సంధ్యా సమయ కాంతి.. అన్నింటికన్నా కింద ఇంకా రాత్రి చీకటిలో ఉండి నలుపు రంగులో కనిపిస్తున్న భూమి కనిపిస్తున్నాయి.

## నిప్పు అంటుకుందనుకుని.. రైల్లోంచి దూకేసిన ప్రయాణికులు



కొందరు ఆకతాయిలు చేసిన పనితో రైలుకు నిప్పు అంటుకుని ఉంటుందని భయపడి కొందరు ప్రయాణికులు కదులుతున్న రైలులోంచి కిందికి దూకేశారు. అందులో 12 మందికి గాయాలయ్యాయి. ఉత్తర ప్రదేశ్ లోని బిల్ పూర్ సమీపంలో ఈ సంఘటన జరిగింది.

**అగ్నిమాపక పరికరంతో..**

హౌడా- అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్ రైలు బిల్ పూర్ స్టేషన్‌కు చేరుకుంటున్న సమయంలో.. కొందరు ఆకతాయిలు అగ్నిమాపక పరికరాన్ని తీసి స్ప్రే చేశారు. దాంతో పొగలు రావడంతో.. రైలులో మంటలు చెలరేగి ఉంటాయనే ఆందోళన మొదలైంది. కొందరు ప్రయాణికులు భయంతో అత్యవసర బ్రేక్ చైన్ లాగారు. కానీ రైలు ఆగేలోపే భయంతో కొందరు ప్రయాణికులు కిందికి దూకేశారు.

12 మందికి గాయాలు

రైలు లోంచి కిందికి దూకినవారిలో 12 మందికి గాయాలైనట్టు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. నిజానికి అప్పటికే రైలు వేగం బాగా తగ్గిందని.. లేకుంటే క్షతగాత్రుల సంఖ్య పెరిగి ఉండేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

# బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత... ఆ టెస్ట్‌ల కోసం ముందే పాక్‌కు వెళ్లనున్న బంగ్లా టీమ్

టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య రెండు టెస్టుల సిరీస్

బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో మంగళవారమే బయలుదేరనున్న బంగ్లా టీమ్

లాహోర్, రావల్పిండిలో బంగ్లా టీమ్ కోసం అదనపు ట్రైనింగ్ సెషన్ అనుమతిస్తామన్న పీసీబీ



ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో బంగ్లా టీమ్ ముందే పాక్‌కు వెళ్లనుంది. బంగ్లా క్రికెట్ టీమ్ ముందే తమ దేశానికి రానుందని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. మంగళవారం వారు బంగ్లాదేశ్ నుంచి బయలుదేరనున్నారు. పాక్-బంగ్లా మధ్య ఆగస్ట్ 21-25, ఆగస్ట్ 30-సెప్టెంబర్ 3 వరకు వరుసగా రెండు టెస్టులు జరగనున్నాయి. బంగ్లా టీమ్ ముందే తమ దేశానికి రావడంపై పీసీబీ సీఈవో సల్మాన్ నసీర్ స్పందించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటి కోసం కొట్లాడ సరికాదని, సోదరభావం ఉండాలన్నారు. లాహోర్‌లో బంగ్లా టీంకు అదనంగా ట్రైనింగ్ సెషన్‌కు అనుమతిస్తామని తెలిపారు. లాహోర్‌తో పాటు రావల్పిండిలోనూ అదనపు ట్రైనింగ్ సెషన్ కోసం అవకాశం ఉందన్నారు.

ఐసీసీ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాక్‌తో టెస్ట్ తమకు చాలా ముఖ్యమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సీఈవో నిజాముద్దీన్ ఛౌదరి అన్నారు. తమ దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తమ టీమ్ ఆటపై దృష్టి పెట్టే పరిస్థితి లేదన్నారు. అందుకే ముందే పాక్‌కు వెళుతున్నట్లు చెప్పారు. పీసీబీ కూడా అంగీకరించిందన్నారు. ఇందుకు పీసీబీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.


# పొలార్డ్ విధ్వంసం.. వరుసగా 5 బంతుల్లో 5 సిక్స్‌లు

ఇంగ్లండ్ వేదికగా జరుగుతోన్న మెన్స్ హండ్రెడ్ బాల్ లీగ్ టోర్నీలో విండీస్ విధ్వంసకర బ్యాటర్ కీరన్ పోలార్డ్ విశ్వరూపం ప్రదర్శించాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ స్పిన్నర్‌గా చలామణి అవుతోన్న ఆఫ్ఘన్ మాంత్రికుడు రషీద్ ఖాన్‌ను ఊచకోత కోశాడు. అతని బౌలింగ్‌లో వరుసగా 5 బంతుల్లో 5 సిక్స్‌లు బాదాడు. దాంతో, మ్యాచ్ ఫలితమే మారిపోయింది.

**6, 6, 6, 6, 6**

హండ్రెడ్ బాల్ లీగ్‌లో భాగంగా శనివారం(ఆగష్టు 10) సదరన్ బ్రేవ్, ట్రెంట్ రాకెట్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ట్రెంట్ రాకెట్స్ నిర్ణీత 10 బంతుల్లో 8 వికెట్లకు 126 పరుగులు చేసింది. క్రిస్ జోర్డాన్(3/22), జోఫ్రా ఆర్చర్(2/18) కట్టడిగా బౌలింగ్ చేశారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన సౌథెర్న్ బ్రేవ్ 80 బంతులు ముగిసేసరికి 6 వికెట్లు నష్టపోయి 78 పరుగులు చేసింది. వారి విజయానికి చివరి 20 బంతుల్లో 49 పరుగులు అవసరమయ్యాయి. ఆ సమయంలో పొలార్డ్ పూనకం వచ్చినట్లు ఊగిపోయాడు. రషీద్ ఖాన్ వేసిన వరుస 5 బంతులను స్టాండ్స్ లోకి పంపాడు. దాంతో, 5 బంతుల్లోనే 30 పరుగులు రావడంతో మ్యాచ్ స్వరూపమూ మారిపోయింది. అప్పటివరకూ మ్యాచ్ ట్రెంట్ రాకెట్స్ వైపు ఉంటే, ఆ ఐదు బంతుల దెబ్బకు సదరన్ బ్రేవ్ విజయం సాధించింది. పొలార్డ్ విధ్వంసానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.





# :డైవింగ్‌లో 8 గోల్డ్ మెడల్స్ సాధించిన చైనా





సెయింట్ డెనిస్ (ఫ్రాన్స్): పారిస్ ఒలింపిక్స్‌లో చైనా బంగారు పతకాల వేటలో దూసుకెళ్తోంది. అమెరికా వంద పతకాలు దాటి సెంచరీ కొట్టగా.. చైనా ఇప్పటికే 37 గోల్డ్ మెడల్స్‌తో టాప్ ప్లేస్‌లో నిలిచింది. చైనా సాధించిన బంగారు పతకాల్లో అత్యధికంగా ఎనిమిది డైవింగ్ స్పోర్ట్ నుంచే వచ్చాయి. ఈ ఆటలో పూర్తి ఆధిపత్యం చూపెట్టిన చైనీయులు... డైవింగ్‌లో ఎనిమిది ఈవెంట్లలోనూ స్వర్ణ పతకాలు సాధించి క్లీన్‌స్వీప్ చేశారు. శనివారం జరిగిన చివరి డైవింగ్ ఈవెంట్ అయిన మెన్స్ 10 మీటర్ల ప్లాట్‌ఫార్మ్‌లో కవో యువాన్ 547.50 స్కోరుతో అగ్రస్థానంతో చైనాకు ఎనిమిదో స్వర్ణం అందించాడు. ఈ పోటీలో అతను వరుసగా రెండోసారి ద బంగారు పతకం గెలిచాడు. 3 మీటర్ల స్ప్రింగ్‌బోర్డ్, 10 మీటర్ల ప్లాట్‌ఫార్మ్, సింక్రనైజ్డ్ 3 మీటర్ల స్ప్రింగ్‌బోర్డ్, సింక్రనైజ్డ్ 10 మీటర్ల ప్లాట్‌ఫార్మ్‌లో అమ్మాయిల, అబ్బాయిల పోటీల్లో చైనానే స్వర్ణాలు గెలుకుంది. మరో రెండు రజతాలు, ఓ కాంస్యం కూడా సాధించడంతో డైవింగ్‌లో చైనా మొత్తంగా 11 పతకాలు గెలిచింది. 2008 ఒలింపిక్స్ నుంచి డైవింగ్ పోటీల్లో చైనా 40 స్వర్ణ పతకాలకు గాను 35 గెలవడం విశేషం.

# తెలుగు సినిమాలపై ఆసక్తి చూపించని భామ..!



మలయాళ భామ మాళవిక మోహనన్ తెలుగు సినిమాల మీద ఆసక్తి చూపించట్లేదా అంటే అవుననే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. మలయాళంలో కెరీర్ మొదలు పెట్టి తమిళ, కన్నడ సినిమాల్లో చేస్తున్న ఈ అమ్మడు తెలుగులో మొదటి అవకాశం ప్రభాస్ మూవీ అందుకుంది. మారుతి డైరెక్షన్ లో వస్తున్న ఈ ప్రాజెక్ట్ లో మాళవిక మోహనన్ కూడా స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. అయితే తెలుగులో డైరెక్ట్ గా సినిమాలు చేయకపోయినా ఆమె నటించిన సినిమాలు డబ్ అయ్యి తెలుగులో రిలీజ్ అయ్యాయి. అలా తెలుగు ఆడియన్స్ కు దగ్గరైంది మాళవిక. ప్రభాస్ సినిమాతో పాటు కోలీవుడ్ లో విక్రం హీరోగా వస్తున్న తంగలాన్ సినిమాలో కూడా అమ్మడు నటిస్తుంది. రీసెంట్ గా రిలీజైన తంగలాన్ టీజర్ లో మాళవిక లుక్ చూసి ఆమె ఫ్యాన్స్ షాక్ అయ్యారు. ఫోటో షూట్ లో తన గ్లామర్ తో మెప్పిస్తూ వచ్చిన మాళవిక తంగలాన్ లో డీ గ్లామర్ రోల్ లో సర్ ప్రైజ్ చేస్తుంది. ప్రభాస్ సినిమాలో నటిస్తుందని తెలిసి టాలీవుడ్ దర్శక నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇస్తా అంటున్నా మాళవిక మాత్రం నో అనేస్తుందట. ప్రభాస్ సినిమా రిలీజ్ అయ్యాక చేస్తా అని కొందరికి చెబుతుంటే.. రెమ్యునరేషన్ ఎక్కువ డిమాండ్ చేస్తుందని టాక్. తెలుగులో పాన్ ఇండియా సినిమాల మీద అమ్మడి ఫోకస్ ఉందని తెలుస్తుంది. అందుకే మాళవిక మరో తెలుగు సినిమాకు సైన్ చేయలేదు. ప్రభాస్ సినిమా రిలీజ్ అయ్యాకే నెక్స్ట్ తెలుగు సినిమా చేయాలి అప్పుడైతేనే తన రేంజ్ కి తగిన ఛాన్స్ వస్తుందని భావిస్తుంది మాళవిక. సినిమాలు ఎలా ఉన్నా అమ్మడు ఫోటో షూట్స్ మాత్రం నెక్స్ట్ లెవెల్ లో ఉంటున్నాయి.

సౌత్ లో సోషల్ మీడియా ఫాలోయింగ్ లో అదరగొట్టే భామల్లో మాళవిక మోహనన్ ఒకరు. అయితే ఫోటో షూట్స్ మాత్రమే కాదు సినిమాలతో కూడా తన సత్తా చాటాలని కోరుతున్నారు ఆమె ఫాలోవర్స్. మిగతా భామలంతా కూడా తెలుగులో ఛాన్స్ లు వస్తే బాగుంటుందని కోరుతుంటే మాళవిక మాత్రం ఇక్కడ దర్శక నిర్మాతలు ఆమె వెంట పడుతున్నా సరే కాదని చెప్పేస్తుంది. ప్రభాస్ సినిమా మీదే తన ఆశలన్నీ పెట్టుకున్న మాళవిక ఆ సినిమాతో తన కెరీర్ గ్రాఫ్ పెంచుకుంటుందా లేదా అన్నది చూడాలి. స్టార్ హీరోయిన్ మెటీరియల్ అయినా అమ్మడు వచ్చిన అవకాశాలను కాదని చెప్పడం వల్లే రేసులో మాళవిక వెనుకబడి ఉందని చెప్పుకుంటున్నారు.

**అలయ ఎఫ్ స్టైలిష్ ఇన్‌స్టాగ్రామ్ ఫోటోలు**





**ఇటీవల జరిగిన ఈవెంట్‌లో చిత్రాంగద సింగ్ ఎరుపు రంగులో కాలిపోయింది**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com